

కర్నూలు నుండి ప్రధాన పట్టణాలకు రైళ్లు నడపాలి

- మహబూబ్ నగర్ నుండి డోన్ వరకు రైల్వే డబ్లింగ్ పనులు పూర్తి చేయాలి
- రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ నిర్మాణం పూర్తి చేయాలి
- పిపిఎస్ఎస్ నిర్వహించిన చర్చాగోష్టిలో ప్రముఖుల డిమాండ్



చర్చాగోష్టిలో మాట్లాడుతున్న విజయకుమార్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నుండి రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, మచిలీపట్నం, కాకినాడ వంటి ప్రధాన పట్టణాలకు కొత్త రైళ్లు నడపాలని, మహబూబ్ నగర్ – డోన్ మధ్యలో రైల్వే ట్రాక్ డబ్లింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలని, పంచలింగాల వద్ద నిర్మిస్తున్న రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, రవీంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ జి.పుల్లయ్య, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం చైర్మన్ ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ముడుమాల యాకోబ్ అధ్యక్షతన బిఎఎస్ ఫంక్షన్ హాల్లో జరిగిన చర్చా గోష్టిలో ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపి, ఎమ్మెల్యేలు, కర్నూలు ప్రజల రైల్వే ప్రయాణ అవసరాలను గుర్తించి పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. రానున్న ఎన్నికలలో ప్రజల రైల్వే రవాణా అవసరాలను తమ ఎన్నికల అజెండాలో చేర్చేలాగా రాజకీయ పార్టీలపై పట్టణ పౌర సంక్షేమ సంఘం ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సాధారణ రైల్వే ప్రయాణికుల అవసరాలను గుర్తించడం లేదని, ప్యాసింజర్ రైళ్లు కనుమరుగవుతున్నాయన్నారు. సామాన్య రైలు ప్రయాణికుల అవసరాలను తీర్చేలాగా ప్రభుత్వం రైల్వే శాఖ కృషి చేయాలని కోరారు. కర్నూలు నుండి విజయవాడ, విశాఖ, మచిలీపట్నం, కాకినాడ వంటి ముఖ్య పట్టణాలకు తక్షణమే రైళ్లు నడపాలని డిమాండ్ చేశారు. విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం తన వంతు కషి చేస్తున్నానని అన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు సహకరిస్తే మన కర్నూలు ప్రజలకు మరింత మెరుగైన రైల్వే సౌకర్యాలను సాధించుకోవచ్చని తెలిపారు. కర్నూలులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రైల్వే గూడ్స్‌షెడ్‌ను దూపాడు దగ్గరలోకి మార్చాలన్నారు. హ్యాంగ్ అవుట్ హోటల్ సమీపంలో నేషనల్ హైవే నుండి నంద్యాల రోడ్ వైపుకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. కర్నూలు నుండి మంత్రాలయం, కర్నూలు నుండి నంద్యాల రైల్వే లైన్లు వేయాలని, మహబూబ్‌నగర్ నుండి డోన్ వరకు రైల్వే డబ్లింగ్ పనులు పూర్తయితే కొత్త రైళ్లు నడిపేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అందరం కలిసి కర్నూలు ప్రజల రైల్వే సౌకర్యాల మెరుగు కోసం కృషి చేద్దామని విజ్ఞప్తి చేశారు. జి. పుల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత విజయవాడ, విశాఖ పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం ప్రజలకు పెరిగిందని దానికి అనుగుణంగా రైల్వే రవాణా సౌకర్యం పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇ. పుల్లారెడ్డి మాట్లాడుతూ రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు వెచ్చిస్తున్నారని, కర్నూలు నుండి రైళ్లను పెంచే విషయంలో, పంచలింగాల దగ్గర నిర్మిస్తున్న వ్యాగన్ వర్క్‌షాప్ నిర్మాణాన్ని వేగవంతం చేయటంలో కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ శ్రద్ధ చూపడం లేదని అన్నారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నగరంలోని అన్ని వర్తక, వాణిజ్య సంఘాలను, వివిధ రంగాలకు సంబంధించిన ప్రముఖులను కదిలించి కర్నూలు ప్రజల రైల్వే సౌకర్యాల మెరుగు కోసం కేంద్ర ప్రభుత్వంపై, ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తీసుకు వస్తుందని తెలిపారు. కర్నూలు నుండి విజయవాడ, విశాఖ, మచిలీపట్నం, కాకినాడ వంటి ప్రధాన పట్టణాలకు రైళ్లు నడపాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య పెంచాలన్నారు. కరోనా సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని, రైల్వేలలో సీనియర్ సిటిజనులు, వికలాంగులు, జర్నలిస్టులకు రాయితీ పునరుద్ధరిం చాలన్నారు. పంచలింగాల వద్ద రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలన్నారు. కర్నూలు – నంద్యాల, కర్నూ లు – మంత్రాలయం మధ్య కొత్త రైల్వే లైన్లు నిర్మించాలని సమావేశం తీర్మానించింది. కర్నూల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు రామచంద్రారెడ్డి, బ్రహ్మయ్య, ఐలు (ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్) జిల్లా అధ్యక్షులు ఎస్.లక్ష్మణ్, న్యాయవాది రాము, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు నాగరాజు, ఏ. వెంకటేశ్వర్లు, మద్దిలేటి, సీనియర్ జర్నలిస్ట్ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యం

డిస్టిక్ ఎక్స్‌టెన్షన్ మీడియా ఆఫీసర్ ఎం.ప్రమీల దేవి



ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

'జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను ప్రజలకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రెగ్నెన్సీ టెస్ట్‌లో పాజిటివ్ ఫలితం అయిన వెంటనే దంపతులకు ఎంసిపి కార్డులో రిజిస్ట్రేషన్ చేసి అందజేస్తాం.వారికి తరుచూ పరీక్షలు చేసి కావల్సి మందులు ఇచ్చి సూచనలు చేస్తారు.' అని జిల్లా డిస్టిక్ ఎక్స్‌టెన్షన్ మీడియా ఆఫీసర్ ఎం. ప్రమీల దేవి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జిల్లాలో అమలవుతున్న పలు వైద్య సేవలు, సంక్షేమ పథకాల గురించి డిస్టిక్ ఎక్స్‌టెన్షన్ మీడియా ఆఫీసర్‌తో ప్రజాశక్తి ముఖాముఖి.....

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, వైద్య సేవలు గురించి వివరించండి?

డెమో: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. గర్భవతులకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పథకాలు, డయాబెటిక్ హైపర్ టెన్షన్, కిడ్నీ, టీబీ సంబంధిత వ్యాధులకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు ప్రజలకు ఒక ప్రణాళిక బద్ధంగా అందిస్తున్నాం. ఆయా పథకాలు వైద్య సేవలపై ప్రజలలో అవగాహన కల్పిస్తున్నాం.

గర్భవతులకు ఎలాంటి వైద్య సేవలు పథకాలు ప్రభుత్వం అందిస్తుంది?

డెమో: గర్భవతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల వైద్య సేవలు పథకాలు అందిస్తున్నాయి. మొదటగా క్షేత్రస్థాయిలో గర్భవతులను గుర్తించుటకు సిహెచ్ఓ(కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్) ఉంటారు. వారి కింద ఆశ వర్కర్లు పనిచేస్తున్నారు. వారు ఇచ్చే కిట్టు ద్వారా అర్హత కలిగిన దంపతులను కలిసి ప్రెగ్నెన్సీ టెస్ట్ చేస్తారు. అనంతరం స్థానిక మెడికల్ ఆఫీసర్‌తో నిర్ధారణ చేసి దంపతులకు వివరిస్తారు. పాజిటివ్ ఫలితం అయిన వెంటనే దంపతులకు ఎంసిపి (మాతా శిశు సంరక్షణ) కార్డులో రిజిస్ట్రేషన్ చేసి అందజేస్తారు.

ఎంసిపి కార్డు అంటే ఏమి అందులో ఎలాంటి వివరాలు నమోదు చేస్తారు?

డెమో: ఎంసిపి అనగా మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ కార్డు. ఈ కార్డులో గర్భవతుల బయోడేటాతో పాటు వారికి నిర్వహించిన టెస్టులు, అందించిన సేవలు నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తారు. స్థానికంగా ఉన్న సిహెచ్ఓ ఆశా వర్కర్లు ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేస్తారు. ప్రతి నెల ఫాలోఅప్ చేస్తూ వైద్య చికిత్సలు అందిస్తారు. ఇలా ఈ విధంగా గర్భం ధరించినప్పటి నుంచి డెలివరీ అయ్యే వరకు వైద్య సేవలు కొనసాగుతాయి. ఆ వివరాలను కూడా ఎన్‌సిపి కార్డులో నమోదు చేస్తూ హైరిస్క్ ఉన్న గర్భవతులను సమీపంలోని వైద్యశాలలకు ముందస్తుగా తీసుకువెళ్లి సురక్షితమైన డెలివరీ అయ్యేందుకు వైద్య సిబ్బంది సహాయ సహకారాలు అందిస్తారు.

గర్భవతులు డెలివరీ అయిన తర్వాత ఎంసిపి కార్డు ఎలా ఉపయోగపడుతుంది?

డెమో: డెలివరీ అయిన తర్వాత బాలింతలుగా చిన్నారులుగా రెండు మార్గాలు చేసి వైద్య సేవలు అందిస్తారు. ఆరు వారాలు బాలింతకాలం ఉంటుంది. ఆసుపత్రిలో సాధారణ తర్వాత మూడవ రోజు నుంచి సిహెచ్ఓ ఆశా వర్కర్లు విజిట్ చేస్తారు. ఇంటి వద్ద డెలివరీ అయిన వారికి ఒకటవ రోజు మూడవ రోజు ఏడవ రోజు విజిట్ చేసి వైద్య సేవలు అందిస్తారు. అనంతరం రెండవ వారం మూడవ వారం నాలుగో వారం లో ఒక్కొక్క రోజు చొప్పున విజిట్ చేసి వైద్య సేవలు అందిస్తారు. పిఎంఎస్ఎంఎ అంటే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమం కింద ప్రతి నెల 9వ తేదీన స్పెషల్ గైనకాలజిస్ట్ వైద్యులు వచ్చి వైద్య పరీక్షలు అందిస్తారు. జననీ సురక్ష యోజన పథకం కింద రూ.5 వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తారు.



శిశు సంరక్షణ కార్యక్రమం ఎలా జరుగుతుంది?

డెమో: శిశు సంరక్షణ కార్యక్రమం ఎబిహెచ్ఎ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ పథకం కింద ప్రతి ఒక్క శిశువుకు ఒక ఐడి కార్డు ఇస్తాం. ఈ కార్డు ద్వారా దేశంలో ఎక్కడ ఉన్నను శిశు సంరక్షణకు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు పొందవచ్చు. మార్చి మూడున నిర్వహించిన పల్స్ పోలియో చుక్కలు విధిగా ఎక్కడైనా వేయించుకున్నారు. ఐదు సంవత్సరముల వరకు చిన్నారులకు అందించే వివిధ రకాల వ్యాక్సినేషన్‌ను పొందవచ్చు.

ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ఎలా జరుగుతుంది?

డెమో: జిల్లాలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం చాలా విజయవంతంగా నడుస్తోంది. ఈ పథకం కింద పెద్ద గ్రామాలకు రెండు పర్యాయాలు చిన్న గ్రామాలకు ఒక పర్యాయం చొప్పున ప్రతినెల 104 వాహనం వెళ్లి వైద్య సేవలు అందిస్తోంది. ప్రధానంగా డయాబెటిక్ రోగులకు, హైపర్ టెన్షన్, కిడ్నీ, టిబి తదితర వ్యాధిగ్రస్తులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తున్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం కింద ఒక వైద్యులు ఒక సూపర్వైజర్ ఒక సిహెచ్ఓ, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, స్థానిక ఎఎన్ఎం, ఆశా వర్కర్లు ఉంటారు. కార్యక్రమం జరిగిన అనంతరం ఎప్పటికప్పుడు అందించిన వైద్య సేవల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు.

నోటిఫికేషన్ వచ్చేలోగా ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా ఏర్పాట్లు అన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆర్ఒలు, నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఆర్ఒలు, నోడల్ ఆఫీసర్లతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నియోజక వర్గాల నోడల్ అధికారులు జిల్లా నోడల్ అధికారులను కలిసి శిక్షణ తీసుకోవాలన్నారు. పొలిటికల్ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి నామినేషన్, స్క్రూటినీ, ఎంసిసి తదితర అన్ని అంశాల మీద అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆర్ఒ లను ఆదేశించారు. సెక్టార్ అధికారులకు వాహనాలను సిద్ధం చేశామన్నారు. ఫ్యూయల్ స్టేషన్, లాగ్ బుక్ నిర్వహణ తదితర అన్ని అంశాలను మ్యాపింగ్ చేశామని, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్లతో సమన్వయం చేసుకుని నియోజక వర్గ కేంద్రాల్లో వాహనాలను సెక్టార్ ఆఫీసర్లకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్ఒలకు సూచించారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌కు సంబంధించి ప్రతి ఒక్క అంశంపై రాజకీయ పార్టీల ఆమోదం ఉండాలన్నారు. ఫార్మ్ డిస్పోజల్ కు సంబంధించి 7 రోజులు దాటిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అనంతరం ఈ అంశాలపై అన్ని నియోజకవర్గాల ఆర్ఒలతో సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంతియాజ్‌కు కర్నూలురత్న పురస్కారం



కర్నూలు రత్నపురష్కారం అందుకుంటున్న ఇంతియాజ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా మేధావుల వేదిక ఆధ్వర్యంలో ఇంతియాజ్‌కు 'కర్నూలురత్న' పురస్కారంతో సన్మానించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నాడు 'మైనారిటీల శ్రేయస్సు దినోత్సవం' సందర్భంగా ఈ పురస్కారాన్ని ప్రకటించారు. మైనారిటీల అభ్యున్నతికి గొప్ప సేవలందించి వారి శ్రేయస్సుకు కృషి చేసి, మైనారిటీ సామాజికవర్గం నుంచి అత్యున్నత స్థాయికి చేరుకున్న ఇంతియాజ్, కర్నూలు ప్రజలు గర్వాంగా చెప్పుకునేలా ప్రజల కలెక్టర్‌గా, ప్రజల అధికారిగా పేరు గడించారని కర్నూలు జిల్లా మేధావుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య మన్సూర్ రహ్మాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణా రెడ్డి, కర్నూలు జిల్లా ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు విజయ కుమార్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది వై.జయరాజు, పారిశ్రామికవేత్త జంషీద్ ఖాన్, విశ్రాంత కార్యనిర్వాహక ఇంజినీర్ సురేంద్రనాథ్, ఉస్మానియా విద్యా కలశాల ప్రిన్సిపల్ డాక్టర్ కరీముల్లాఖాన్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మహాదేవ్ రావు, చరిత్రకారులు బెంజిమన్ ఇమ్మానుయేల్, వ్యాపారవేత్తలు షబ్బీర్ అహ్మద్, షరీఫ్, పాత్రికేయులు ఖుద్రతుల్లాహ్ ఖాద్రి, అధ్యాపకులు షరీఫ్, అబిద్, ఐజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రత భరోసాకు ఫ్లాగ్‌మార్చ్ : ఎస్‌పి

- ప్రజలు స్వేచ్ఛగా , నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
- కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు



కర్నూలులో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాలలో పోలీసులు కవాతు నిర్వహించారని కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు ప్రజలలో భరోసా కల్పించేందుకు , ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతి భద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేం దుకు అందరూ సహకరించాలని ప్రజలకు ఎస్‌పి విజ్ఞప్తి చేశారు. ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా దానికి జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉం టుందన్నారు. జిల్లాలోని ఎమ్మిగనూరు, కర్నూలు, పత్తికొండ సబ్ డివిజన్ లలోని పలు ప్రాంతాలలో కేంద్ర సాయిధ బలగాలైన 'సశస్త్ర సీమా బల్' సిబ్బందితో కలిసి పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

ఆర్. కొంతలపాడు, ఉల్చాల గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్

కర్నూలు డిఎస్‌పి విజయశేఖర్ పర్యవేక్షణలో కర్నూలు తాలుకా సిఐ శ్రీధర్ ఆధ్వర్యంలో కర్నూ లు తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలోని ఆర్. కొంతలపాడు గ్రామం, ఉల్చాల గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు.

ఎమ్మిగనూరు పట్టణంలో ఫ్లాగ్ మార్చ్

ఎమ్మిగనూరు డిఎస్‌పి సీతరామయ్య పర్యవేక్షణలో ఎమ్మిగనూరు టౌన్ , రూరల్ సిఐలు మధుసుధన్ రావు, మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు టౌన్ పిఎస్ పరిధిలోని ఎమ్మిగనూరు పట్టణంలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. పత్తికొండ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో దేవనకొండ యుపిఎస్ సిఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దేవనకొండ యుపి ఎస్ పరిధిలోని దేవనకొండ, కుంకనూరు, వెల్మ కూర్, కోటకొండ ,కప్పట్రాళ్ల గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు.



నారీ శక్తి పురస్కారాలు

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టిజివి కళాక్షేత్రంలో 22 మందికి వివిధ రంగాల్లో సేవలు అందించిన మహిళలకు నారీశక్తి పురస్కారాలు అందజేశారు. నటరాజ నృత్య కళామందిరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, విద్యాసంస్థల అధినేత కెవి.సుబ్బారెడ్డి, కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీ శక్తిని వివిధ కోణాల్లో కొనియాడారు. మహిళల సహకారం అన్ని రంగాల్లో అనివార్యమన్నారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకులు కరీముల్లా స్వాగతం పలుకుతూ విద్యా, వైద్య,సంగీత,సాహిత్య, రంగాలకు చెందిన విశిష్ట మహిళలను ఎంపిక చేసి సన్మానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌పి మహబూబ్ బాషా సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు అర్జి ఇచ్చినా ఫలితం లేదు

వికలాంగులు రంగమ్మ ఆవేదన



ప్రజాశక్తి-పత్తికొండ

గ్రామస్థాయి, డివిజన్ స్థాయి అధికారులకు సమస్యను పరిష్కరించాలని అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడంలేదని వికలాంగులు రంగమ్మ కన్నీరు మున్నీరవుతున్నారు. ఆదివారం ప్రజాశక్తితో తమ బాధను వినిపించారు. పత్తికొండ మండలం హోసూరు గ్రామంలోని సర్వేనెంబర్ 625లో ఇంటి నెంబర్ 1-1 సంబంధించిన సెంటు స్థలం ఆక్రమించారని, గ్రామ పంచాయతీ సెక్రెటరీ మునిస్వామికి 2023 ఆగస్టు31, పత్తికొండ రెవెన్యూ డివిజన్ అధికారి నీలపు రామలక్ష్మికి 2024 ఫిబ్రవరి26న కలిసి వినతి పత్రం ఇచ్చినా తమ సమస్యను పట్టించుకోవడం లేదని రంగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. నా తండ్రి చిన్న రామన్న సెంటు స్థలాన్ని వికలాంగురాలునని జీవనాధారం కోసం రాసిచ్చారని అన్నారు. ఆ స్థలంలో పెద్ద మునేప్ప ఇల్లు నిర్మిస్తున్నాడని పంచాయతీ సెక్రెటరీ చెప్పినా పట్టించుకోకుండా పెద్ద మునేప్ప రాసిచ్చాడని ,తనకు అన్యాయం చేసిన పంచాయతీ సెక్రెటరీ పై చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వికలాంగురాలిననే చిన్న చూపుతో ప్రభుత్వ అధికారులు నాపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ అయినా స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ఉర్దూ యూనివర్సిటీ భవనాలను నిర్మించాలి

టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలానా ముస్తక్ అహ్మద్



ఉర్దూ యూనివర్సిటీ వద్ద టిడిపి ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ ఆధ్వర్యంలో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు సమీపంలోని చంద్రబాబు హయాంలో చేపట్టిన మౌలానా అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఎదుట టిడిపి మైనార్టీ సెల్ నాయకులతో కలసి ధర్నా నిర్వహించారు. యూనివర్సిటీకి సంబంధించిన స్థలాన్ని టిడిపి మైనార్టీసెల్ నాయకులతో కలిసి మౌలానా ముస్తక్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో అబ్దుల్ హక్ యూని వర్సిటీ కోసం 120 ఎకరాల స్థలం కేటాయించారని, వైసిపి ప్రభుత్వం వచ్చి ఐదేళ్లు అయినా కనీసం అప్పటినుంచి నేటి వరకు ఒక ఫ్లోర్ కూడా పూర్తి చేయ లేదని అవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి మైనార్టీలకు పదవులు ఇచ్చేది అభివద్ధి చేయడానికి కాదు ముస్లింలను మోసం చేయడానికి అని ఎద్దేవా చేశారు. వైసిపి పార్టీలో ఉండే ముస్లిం నేతలు ఆలోచించాలని చంద్రబాబు నాయుడు హయాంలో ప్రారంభించిన ఈ ఉర్దూ యూనివర్సిటీలో కనీసం ఒక ఇటుక కూడా కట్టలేదని అన్నారు. చివరికి యూనివర్సిటీ బోర్డును కూడా ధ్వంసం చేశారని, ఎందుకంటే వైసిపి ప్రభుత్వం విధ్వంసాల ప్రభుత్వమని దుయ్యబట్టారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జగన్ కట్టడాలను కూల్చడమే తప్ప నిర్మించడం లేదని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా బిసి,ఎస్‌సి,ఎస్‌టి, ముస్లిం నాయకులపై దాడులు జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో గాని రాష్ట్రం విడిపోయినప్పుడు గాని ఎన్నో హజ్ హౌసులు కట్టించారని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో పనిచేస్తున్న మైనార్టీలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీలకు సంబంధించిన సంక్షేమ పథకాలు ఎందుకు నిలిపివేశారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

తక్షణమే అబ్దుల్ హక్ యూనివర్సిటీని నిర్మించకపోతే సిఎం జగన్మోహన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉర్దహక్కు యూనివర్సిటీ నిర్మాణం కోసం తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శిలు అబ్దుల్ రషీద్, ఖజా ఫరీద్, టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కరిముల్లా మరియు 200 మంది టీడీపీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని గురుకుల పాఠశాలలో ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రవేశానికి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆదివారం ఉదయం 10 గంటలకు ఆరవ తరగతికి 1012 లో 934 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇంటర్ ప్రవేశానికి 524 కు గాను 475 మంది హాజరయ్యారు. ఆరులో 73 మంది, ఇంటర్ లో 43 మంది గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపల్ బలరాం తెలిపారు.

వైసిపిని వీడి 100 కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 33 వ వార్డు పాత కల్లూరుకు చెందిన వైసిపి ముఖ్య నాయకుడు కాంట్రాక్టర్ తెలుగు రమేష్‌తో సహా 100 కుటుంబాలు సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ ఎన్‌వి. రామకృష్ణ ఆధ్వర్యంలో నందికొట్కూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జి గౌరు వెంకట రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి గౌరు వెంకట రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు సింగిల్ విండో మాజీ చైర్మన్ ఎన్‌వి. రామకృష్ణ, పవన్ కుమార్, పోలిరెడ్డి సంపతి, లక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రోత్సాహం అవసరం

రాయల్ మహిళ సంఘం ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం

ఘనంగా మొదటి వార్షికోత్సవం



మహిళ దినోత్సవం రాయల్ మహిళ సంఘం సభ్యులు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నా, దాడులు, అత్యాచారాలు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని అందుకు మహిళలకు మరింత ప్రోత్సాహం అవసరమని లలిత కళాసమితి అధ్యక్షులు పత్తిఓబులయ్య అన్నారు. రాయల్ మహిళ సంఘం ఆధ్వర్యంలో మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సి.క్యాంప్‌లోని లలిత కళా సమితిలో రాయల్ మహిళ సంఘం మొదటి వార్షికోత్సవం, మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. లలితకళా సమితి అధ్యక్షులు పత్తిఓబులయ్య, డాక్టర్ కుల్లాయప్ప మాట్లాడారు. మహిళలను గౌరవించాలని ఒక తల్లిగా, చెల్లిగా అక్కగా, భార్య గా ఇలా అనేక బంధాల్లో మహిళలు ప్రత్యేక బంధమన్నారు. అనంతరం రాయల్ మహిళ సంఘం నాయకురాలు సుధావర్షిణి, సుజాత బ్రహ్మణీ, ఆదిలక్ష్మి, నవిత, గవహినిదేవిలు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాదిస్తున్నారని, అలాంటి మహిళలను మరింత ఉన్నత స్థితికి చేరేలా ప్రతి ఒక్కరు ప్రోత్సాహం అందించాలని తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు డెంటల్ డాక్టర్ స్మిత రాయల్, రామకృష్ణ స్కూల్ నిర్వహకురాలు చింతలపల్లి విజయలక్ష్మి, రెవెన్యూ అధికారి ,ఆలవరలక్ష్మి, రాయలసీమ యూనివర్సిటీ ఎస్‌వి సునీత, ప్రభుత్వ ఉద్యోగి బి.సుమంగళి, ఆర్.శ్రీదేవి, కె.శైలజ, కె.మంజుల, శ్రీదేవిలను శాలువాలతో సన్మానించారు. వివిధ రంగాల మహిళలు, అధ్యాపకులు సింగం శెట్టి సోమశేకర్ ,డిఇఇ మల్లికార్జున మూర్తి, కాపురాక్స్ మెంబర్స్, మహిళ సంఘాల నాయకురాలు పాల్గొన్నారు.



విజేతలకకు ఛాంపియన్‌షిప్ కప్‌ను అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

హ్యాండ్ బాల్ ఛాంపియన్ అనంతపురం

మూడవ స్థానంలో కర్నూలు

ముగిసిన రాష్ట్ర స్థాయి పురుషుల హ్యాండ్ బాల్ పోటీలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

52వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పురుషుల ఛాంపియన్‌షిప్‌ను అనంతపురం జట్టు కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో పశ్చిమగోదావరి మూడో స్థానంలో కర్నూలు జట్లు నిలిచాయి. ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి.శంకర్ శర్మ విజేతలకు కప్‌లు, పతకాలు ప్రతిభాపత్రాలు అందజేసి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల నిర్వహణ కష్టతరమైనప్పటికీ ఇష్టంతో నిర్వాహకులు చేపట్టి విజయవంతం చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. పోటీల్లో ప్రతిభగనకరించిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి. శ్రీనివాసులు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, వివిధ జిల్లాల క్రీడా సంఘ ప్రతినిధులు లక్ష్మణ్, చంద్రశేఖరరావు, మహబూబ్‌బాషా, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రతినిధులు సువర్ణ, గంగాధర్, కొండపోగు సుంకన్న పాల్గొన్నారు.

సిసి రోడ్లు, కాలువలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు నగరం, ఓల్డ్ టౌన్ లోని గనిగల్లి, కుమ్మరి గేరిలో సిసి రోడ్లు, సిసి కాలువలకు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ వైసిపి కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎఎండి ఇంతియాజ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకారెడ్డి, 4 వార్డు కార్పొరేటర్ హర్షియా పర్వీన్, మాబుసా, వైసిపి క్లస్టర్- 1 నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి : సిఐ


సాయుధ బలగాలతో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - దేవనకొండ

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగిం చుకోవాలని స్థానిక సీఐ శ్రీనివాసులు కోరారు. ఆదివారం మండలం లోని కుంకనుర్, దేవన కొండ, వేలమకుర్, పి.కోటకొండ, కప్పాట్రాళ్లలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కర్నూల్ జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు కవాతు నిర్వహించమ న్నారు. 100 మంది కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసు అధికారులు కవాతు నిర్వహిస్తూ గ్రామా ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూవారిలో ధైర్యాన్ని నింపే విధంగా ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం నిర్వహించారన్నారు.

300 మంది టిడిపిలో చేరిక


టిడిపిలో చేరుతున్న ఆర్ యు ఎస్ ఎఫ్, ఆర్ పి ఎస్ ఎఫ్ విద్యార్థి సంఘు నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్స్ ఫెడరేషన్, రాయలసీమ యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ విద్యార్థి సంఘు నాయకులు అఫ్రీది, రఘునాథ్, నరసింహులు, అజయ్, వినయ్ మరియు వారి అనుచరులు సుమారు 300 మంది యువకులు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు డాక్టర్ బివి జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో ఆదివారం ఎమ్మిగనూరులోని బివి నివాసంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార ధికారంలోకి రాక ముందు సిఎం జగన్ ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని, ప్రతి సంవత్సరం డీఎస్సీ నిర్వహిస్తానని చెప్పి మోసం చేశారన్నారు. నిరుద్యోగ సమస్యలపై మెమోరాండం ఇవ్వడానికి వెళ్లినా తప్పుడు కేసులు నమోదు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల కోసం టిడిపి ప్రకటించిన పథకాలకు ఆకర్షితులై ఆ పార్టీలోకి చేరుతున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా వీరికి బివిజె పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. తాలూకా టిడిపి మైనార్టీ నాయకులు తురేగల్ నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కార్యాలయ ముట్టడికి సిద్ధం

- జై భీమ్ మాల మహానాడు, సమతా సైనిక్ దళ్



మాట్లాడుతున్న జై భీమ్ మాల మహానాడు రాష్ట్ర నాయకులు రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

త్వరలో తాడేపల్లిలోని సీఎం కార్యాలయం ముట్టడికి సిద్ధంగా ఉన్నామని జై భీమ్ మాల మహానాడు రాష్ట్ర నాయకులు, సమతా సైనిక్ దళ్ రాయలసీమ అధ్యక్షులు సి. రంగయ్య అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ హత్య డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత బాబుని పదవి నుండి బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో తాడేపల్లిలో సీఎం కార్యాలయం ముట్టడికి సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర కమిటీ ఆదేశాలకోసం వేచిచూస్తున్నాం అని తెలిపారు. మల్లేష్, నల్లన్నలు మాట్లాడుతూ దళితుల మీద పైశాచికంగా దాడి చేసి హత్య చేసి డోర్ డెలివరీ చేసిన అనంత బాబుని వెంట వేసుకుని తిరగడం దళితుల మనోభావాలను గౌరవంని శాశ్వతంగా తుంచివేసినట్టే అన్నారు. కోడికత్తి శ్రీను కేసుని యన్ఐఏకి అప్పగించి విచారణ జరిపిన జగన్ సుబ్రహ్మణ్యం హత్య కేసు సిబిఐకి ఎందుకు అప్పగించడం లేదని మాలమహానాడు సీనియర్ నాయకులు రాజోలప్ప, చిన్న రంగన్న, చిట్టెన్న ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, నల్లన్న, రాజోలప్ప చిన్నరంగన్న, బలరాం, మల్లి నాగార్జున, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సిద్ధారూడ స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండల కేంద్రంలో వెలసిన శ్రీ సిద్ధారూడ స్వామి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. మేళతాలాతో గ్రామ పురవీదుల గుండా ఊరేగింపుతో బస్టాండ్ ఆవరణలోని రథంలో ప్రతిష్టించారు. అనంతరం మాజీ విఆర్ఓ రామలింగారెడ్డి రెడ్డి గృహంనుంచి పూర్ణకుంభాన్ని ఊరేగిస్తూ రథం వద్ద తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరకు అశేష జనవాహిని మధ్య రథం లాగారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీవిద్య,మాజీ విఆర్ఓ రామలింగారెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, వైసీపీ రాష్ట్ర యువజన నాయకులు వై ప్రదీప్ రెడ్డి,మండల కన్వీనర్ రామ్మోహన్రెడ్డి,వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తం రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాం, టిడిపి యువనాయకులు పాలకుర్తి దివాకరరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి, మల్లికార్జున, ఏసేపు,నరసన్న, ఆంజనే యులు, ఈరన్న,వైసీపీ నాయకులు రవిచంద్రారెడ్డి, విజేందర్రెడ్డి, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొ రేషన్ డైరెక్టర్ బి చంద్ర శేఖర్ రెడ్డి,వైసిపి నాయకులు ముక్కరన్న, అరలప్ప శాంతిరాజు పాల్గొన్నారు.

పేదల నిఖా సులభతరానికి కృషి

ప్రజాశక్తి - ఆదోని : రానున్న రోజుల్లో మైనార్టీ పేదలకు నిఖాను సులభతరం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని నూతన ఖాజీ తాహేర్ మిస్బాయి తెలిపారు. ఆదివారం ఆదోనిలోని కేకేబీ ఫంక్షన్ హాలులో ముఖ్యఅతిథులు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎంజీ గౌస్, సీనియర్ న్యాయవాది మన్సూర్ అహ్మద్, ముఫ్తీ సమీర్ మౌలానా, దుల్హాపైల్వాన్ మసీదు ముతవల్లీ జిక్రియా సమక్షంలో నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. సీనియర్ న్యాయవాది మన్సూర్ అహ్మద్ మాట్లాడుతూ పదేళ్ల కాలానికి ఖాజీని నియమించిందని ఈ సేవలు మైనార్టీలు ఉపయోగించుకోవాలని కోరారు. దుల్హాపైల్వాన్ మసీదు ముతవల్లీ జిక్రియా మాట్లాడుతూ కరోనా సమయంలో పెంచిన ఫీజులను తగ్గించుకోవాలని ఖాజీ అల్తాఫ్ హుస్సేన్‌కు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా నిరంకుశ ధోరణి ప్రదర్శించారని మండిపడ్డారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఖాజీ ఏ మాత్రం భేషజాలకు పోకుండా అందర్నీ కలుపుకొని చైతన్య పరుస్తూ నాణ్యమైన సేవలు అందించాలని కోరుకుంటుమన్నారు.

క్రీడలతో స్నేహభావం

ప్రజాశక్తి - ఆదోని : క్రీడలు ఆయా ప్రాంతాల క్రీడాకారుల మధ్య స్నేహభావాన్ని పెంచుతాయని టీడీపీ పిసి సెల్ రాష్ట్ర ప్రచార ప్రతినిధి బంక తిమ్మప్ప, ఒకటవ వార్డు టిడిపి ఇన్చార్జి వెంకటేష్ అన్నారు. ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా డి స్ట్రయికర్ టీం ఆధ్వర్యంలో ఆదోనిలోని శ్రీజీహ్వేశ్వర పాఠశాల మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో విజేతలకు మారుతి నాయుడు రూ.20 వేలు, బత్తిని కుబేర్నాథ్ రూ.15 వేలు, కొంకా సిద్దార్థ నాయుడు రూ.10 వేలు స్పాన్సర్ చేయగా విజేతలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలుగుదేశం కార్యకర్తలు వీరేష్, జయరాం, వెంకటేష్, నాగేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్లో మొదటి బహుమతి వాల్మీకి జేఎంఆర్ టీం, రెండో బహుమతి డి స్ట్రయికర్, మూడో బహుమతి ఎన్ఎస్ గౌస్ టీం సాధించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


బహుమతులు అందజేసిన దృశ్యం

ప్రజాశక్తి - ఆస్పరి : మహాశివరాత్రి పండుగ సంద్భంగా మండల పరిధిలోని బిణిగేరి గ్రామం శ్రీ గిరి క్షేత్రంలో వెలసిన శ్రీ పంచలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన న్యూ కేటగిరీ ఎద్దుల బండ లాగుడు పోటీలు హోరా హోరీగా సాగాయి. ఈ పోటీలను ఆలయ నిర్వహకులు శ్రీనివాస నాయన,ఆలూరు వైసిపి ఇన్చార్జి విరుపాక్షి సోదరుడు, తనయుడు శ్రీ రాములు, చంద్రశేఖర్‌లు ప్రారంభించారు. గెలుపొందిన వృషభాలకు బహుమతులు అందజేశారు. ఆలూరు వైసిపి ఇన్చార్జి విరుపాక్షి రూ.50 వేలు ప్రకటించగా వెంకటగిరి వృషభాలు మొదటి బహుమతి దక్కించుకున్నాయి. ఈ కార్యక్రమ ంలో జెడ్పీటీసీ దొరబాబు,సర్పంచ్ వెంకటేష్, గ్రామ పెద్దలు చిన్న రెడ్డి, వెంకటేష్, శేషాద్రి నాయుడు, భీమ్మన్న,శంకర్,సోమన్న, తిక్కయ్య,వైసీపీ నాయకులు మారయ్య, రామాంజినే యులు, కేశవ రెడ్డి,పురుషోత్తమ రెడ్డి పాల్గొన్నారు.

'ఆడా'.. జాడ యాడ..

- ఏర్పాటైన ప్రయోజనం శూన్యం
- కలగానే మిగిలిన కరువు, వలసల నివారణ
- పశ్చిమ ప్రాంతం అభివృద్ధిపై శీతకన్ను
- ఫలితం ఇవ్వని మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేల సమావేశం
- ప్రభుత్వానికి కనిపించని చిత్తశుద్ధి


పనులు లేక వలసలు వెళ్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఆదోని

కరువు కాటకాలకు నిలయం ఆదోని పశ్చిమ ప్రాంతం. ప్రభుత్వాలు మారిన ప్రజల తలరాతలు మారడం లేదు. వలసలు నివారించి.. ఉన్నచోటన ఉపాధి కల్పించి మెరుగైన జీవితం ఇస్తాం అంటూ ప్రభుత్వం ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ బోర్డును ఏర్పాటు చేసింది. అయితే ఆ బోర్డు ఇంతకు వరకు ఏమైనా వలసలను నివారించిందా.. ఈ ప్రాంతా అభివృద్ధికి ఏయే పనులు చేపటిందో తెలీయదు. తీర ఇక ఆడా ముగిసిన అధ్యయంగానే మిగిలింది. బోర్డు ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన కూడా ఇంతవరకు లక్ష్యాన్ని చేరుకోవడంలో ఓనమాలు కూడా దిద్దడం లేదని ప్రజా సంఘాల నాయకులు, విశ్లేషకులు విమర్శిస్తున్నారు. అసలు ఆడా జాడే లేదని కొందరు ప్రశ్నిస్తున్నారు. కేవలం ఆడాకు ప్రత్యేక అధికారిని నియమి ంచారే తప్ప ఎలాంటి నిధులు ఇవ్వకపోవడంతో లక్ష్యం ఎలా నెరవేరుతుందని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. కరువు నివారణ వలసల అరికట్టడమే ప్రధాన లక్ష్యంగా బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆ దిశగా అడుగులు వేయలేకపోవడంతో ఈ ఏడాది కూడా సర్వసాధారణంగా ఆదోని డివిజన్లోని ఐదు నియోజకవర్గాల నుంచి దుర్ప్రాంతాలకు వేల సంఖ్యలో వ్యవసాయ కూలీలు కడుపు చేత పట్టుకుని పిల్లాపాపలతో ఉపాధికై వలస బాట పట్టారు.

డివిజన్ అంతా ఇదే పరిస్థితి : ఆదోని డివిజన్లోని మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి, పెద్ద కడుబురు, కౌతాళం మంత్రాలయం నుంచి ఇప్పటికే సుమారు పదివేల మందికి పైగా ఉపాధి కోసం వ్యవసాయ కూలీలు గుంటూరు, హైదరాబాదు, బెంగళూరు ప్రాంతాలకు వలస వెళ్లారు. ఆడా ఏర్పడి 2022వ ఏడాది నవంబర్ ఐదున ఆదోని కేంద్రంగా అప్పటి మంత్రి గుమ్మనూరు జయరామ్, జిల్లా కలెక్టర్‌తో పాటు ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ, ఎమ్మెల్యేలు సాయి ప్రసాద్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, బాలనాగిరెడ్డి, శ్రీదేవితో పాటు ఆదోని సబ్ కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, డివిజన్ స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ బోర్డు పరిధిలోని ఆయా మండలాల అభివృద్ధి కోసం, కరువు నివారణ కోసం, వలస నివారణ కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని ప్రకటన చేశారు. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అందరూ భావించారు. సమావేశాలకే పరిమితమైందే తప్ప నివారణ కోసం ప్రత్యేక నిధులు ఇచ్చిన దాఖలాలు లేవు.

ఏడాదిలో వలసల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు నివేదిక ప్రభుత్వానికి పంపామని అధికారులు చెప్పిన ఏలాంటి లబ్ధి చేకూరలేదు. ఎమ్మెల్యేలు, మంత్రి, జిల్లా కలెక్టర్ చర్చించి ముఖ్యమంత్రికే ప్రత్యేక నివేదిక పంపినట్లు అప్పట్లో ప్రకటించారు. ఇంతవరకు ఎలాంటి చర్యలు లేకపోవడంతో ఇక్కడ బ్రతకలేక వలసలు మొదలయ్యాయి. ఇక పశ్చిమ ప్రాంతం మరింత వెనుకబాటుగురయ్యే ప్రమాదం ఉంది.

పశ్చిమ ప్రాంతం నిత్యం కరువు కాటకాలకు గురయ్యే ప్రాంతంగా ఉంది. ఈ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్ నెలలో ఆదోని ఏరియా డెవలప్మెంట్ అథారిటీ బోర్డు (ఆడాకు)ను ఏర్పాటు చేసింది. ఈ బోర్డుకు ఐఎఎస్ ఆఫీసర్‌తో స్పెషల్ ఆఫీసర్లను నియమించి ఇందులో ఆడాకు కీలక శాఖలకు చెందిన అధికారులను సభ్యులుగా ఉంటారు. ప్రజాప్రతినిధులు కూడా ఈ బోర్డు పరిధిలో జరిగే సమావేశాలకు హాజరై తమ సలహాలు సూచనలు కూడా ఇవ్వవచ్చని ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలో పేర్కొంది. ఈ బోర్డు నుంచి వచ్చిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తే వాటిని ఆచరణలోకి తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ బోర్డు ఏర్పాటైన అనంతరం కేవలం రెండు, మూడు సార్లు మాత్రమే సమావేశం నిర్వహించారు. గతంలో ఈ బోర్డుకు స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ తమీమ్ అన్సారీయ వ్యవహరించారు. అనంతరం ఆదోని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఒకసారి సమావేశాన్ని నిర్వహి ంచారు. ప్రస్తుతం సబ్ కలెక్టర్‌గా శివ నారాయణ శర్మను ప్రభుత్వం నియమించింది.

సాగు నీటి సౌకర్యం కల్పిస్తే సస్యశ్యామలం

సాగునీరు తుంగభద్ర దిగువ కాలవ నుండి ప్రతి ఏడాది ఖరీఫ్ రబీ సీజన్లో పూర్తిస్థాయిలో రావాల్సిన వాటాను సాధించి అందిస్తామన్న నమ్మకం రైతుల కల్పిస్తే ఈ ప్రాంతంలో పంటలు గత 20 సంవత్సరాల క్రితం పండించిన విధంగా పండించుకుంటూ కూలీలు వలస పోకుండా ఉంటారని, వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను నిర్మిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం కావడానికి అవకాశం ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని వలసలు నివారించడమే కాకుండా, తుంగభద్ర దిగువ కాలువ నుండి పూర్తిస్థాయిలో సాగునీరు సాధించే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజా సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

- శివ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్.

గ్రామీణ ప్రాంతాలలో వలస వెళ్లకుండా లోకల్ గానే పనులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. వలస వెళ్లడం వల్ల అక్కడ కలిగే ఇబ్బందులను క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. వలస వెళ్లిన పరిస్థితి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నాం.

శాశ్వత పనులు చేపట్టాలి

- వెంకటేశ్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు.

వర్షాధారంపైనే ఈ ప్రాంతంలో వ్యవసాయం సాగుతోంది. వర్షం రాకపోతే కరువు పరిస్థితి తీవ్రమైతుంది. ఈ ప్రాంతం అభివృద్ధికి శాశ్వత కరువు నివారణ చర్యలు తీసుకోవాలి. ఉపాధి కోసం ప్రత్యేకంగా పరిశ్రమల స్థాపించాలి. అలాగే వంకలు, చెరువుల ఆధారంగా పంటలు సాగు చేసుకునే విధంగా రైతులకు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం చిత్తశుద్ధితో సాగునీటి ప్రాజెక్టులు కల్పించి శాశ్వత వలస నివారణ చర్యలు చేపట్టాలి.

వైసిపి పాలనకు చరమగీతం పాడాలి

- డాక్టర్ మాచాని సోమనాథ్


ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ మాచాని సోమనాథ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రైతులు కష్టాలు తీరాలంటే చంద్రబాబుకు పట్టం కట్టాలని, రైతును దగా చేసిన సీఎం జగన్ పాలనకు చరమగీతం పాడాలని ఎమ్మిగనూరు నియోజకవర్గంలో టిడిపి నాయకులు డాక్టర్ మాచాని సోమనాథ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఎమ్మిగనూరు పట్టణంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నందు గల కూరగాయల వేలం మార్కెట్ నందు,ఎద్దుల మార్కెట్ యందు, మేకల బజార్‌లో బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారెంటీపై ప్రచారం నిర్వహించారు. రైతులను కలుసుకొని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, బాధలను విన్నారు. ఈ సందర్భంగా మాచాని సోమనాథ్ మాట్లాడుతూ.. జగన్ రాష్ట్రాన్ని పరిపాలించడంలో ఘోరంగా విఫలం చెందారని ధనయజ్ఞమే ధ్యేయంగా ఉండడంతో జల యజ్ఞాన్ని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. పశ్చిమ ప్రాంత రైతులకు జీవనాడి అయిన ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణానికి చంద్రబాబు నాయుడు తన హాయంలో వేలకోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తే జగన్ పనులు ప్రారంభించక నిర్లక్ష్యం వహిస్తూ రైతులకు తీరని అన్యాయం చేశారని దుయ్య పడ్డారు. పెండింగు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కావాలంటే చంద్రన్న ముఖ్యమంత్రి కావాలన్నారు. టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు అన్ని వర్గాలకు లబ్ధి చేకూరు తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి.అల్తాఫ్, మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఇప్పె నరసప్ప, తెలుగు మహిళ నాయకురాలు గోకారమ్మ,రోజా ఆర్ఫ్ ఉసేని, కే.ఎం.డి.అబ్దుల్ జబ్బర్, కంపాడు చిన్న రంగన్న, మైనార్టీ నాయకులు గోరా బాష, జోహార్ అబ్బాస్, ఆఫ్ఘాన్ వలి బాష, మాసుమాన్ దొడ్డి బోయ శ్రీనివాసులు, ధన పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

పట్టణంలో మునిసిపల్ 10వ వార్డు నందు పెద్ద కమేళా సమీపంలో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు మాలిన్ వృద్ధురాలి గుడిసె పూర్తిగా దగ్ధమై సర్వం కోల్పోయిన విషయం తెలుసుకున్న మాచాని సోమనాథ్ దగ్ధమైన గుడిసెను పరిశీలించి ఆర్థిక సాయం అందిం చారు. మంటలార్పడానికి యత్నించిన గుడిసె పక్కన నివాసముండే పేదవారి సైకిల్ కాలిపో వడంతో వారికి కూడా ఆర్థిక సాయం అందించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే బాధితురాలికి పక్కా గృహం మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మిగనూరు మండల తహసిల్దార్ వారు వెంటనే స్పందించి కట్టు బట్టలతో ఉన్న బాధితురాలికి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి.అల్తాఫ్, మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు, బైలిప్పుల గ్రామ టిడిపి నాయకులు లక్ష్మీ నారాయణ, ఎస్సీ కాలనీ టిడిపి నాయకులు రోజా ఆర్ఫ్ ఉసేని, కంపాడు చిన్న రంగన్న తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి

బుట్టా రేణుక ఆర్థికసాయం


ఆర్థిక సాయం అందిస్తున్న బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని 10వ వార్డులో శనివారం నాడు గుడిసె దగ్ధమై సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి నూతన గుడిసె ఏర్పాటుకు వైసిపి ఎమ్మిగనూరు సమన్వయకర్త బుట్టా రేణుక ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా బుట్టా రేణుకమ్మ మాట్లాడుతూ గుడిసె కాలిపోయిన పేద కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతూల్, వైస్ చైర్మన్ న నజీర్, అహ్మద్, కౌన్సిలర్ రాజారత్నం, ఇన్ ఛార్జ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో భక్తుల కోలాహలం


అలకంరణంలో బృందావనం


శ్రీమఠంలో భక్తులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల కోలాహలం నెలకొంది. మూడు రోజులు వరుసగా సెలవులు రావడంతో భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం రాఘవేంద్రుని దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మంత్రాలయం చేరుకున్న భక్తులు గ్రామదేవత మంచాలమ్మ రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు శ్రీ మఠం దివాన్ విశేష పూజలు నిర్వహించిన అనంతరం రాఘవేంద్రుని బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకీలో ఉంచి వేద మంత్రాలతో మంగళ వాయిద్యాలు నడుమ శ్రీ మఠం ప్రాకారంలో సేవాదారులతో మోయించారు. తెల్లవారుజామున రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని నిర్మాల్యం చేసిన పూజారులు తులసి అర్చనతో పంచామృతాభిషేకము వంటి పూజలు నిర్వహించారు. అనంతరం బృందా వనాన్ని స్వర్ణకవచాలతో పట్టు వస్త్రాలతో వివిధ పుష్ప హారాలతో అందంగా అలంకరిచారు. పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు విశిష్ట పూజలు నిర్వహించిన అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకుని నైవేద్య సమర్పణతో మంగళ హారతులు ఇచ్చారు. అంతకు ముందు భక్తులకు ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై శ్రీ మఠానికి చేరుకున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన భాగ్యం కల్పించారు.

నేటి నుండి గురు వైభవోత్సవాలు

- విజయవంతం చేయండి

- శ్రీ మఠం మేనేజర్ యస్కే.శ్రీనివాసరావు



ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో శ్రీ గురువైభవ మహోత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీ మఠం మేనేజర్ యస్కే. శ్రీనివాసరావు కోరారు. ఆదివారం ఆయన విలేకరులకు సమాచారం అందించారు. శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి 16 వరకు జరుగు ఈ మహోత్స వాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. శ్రీ రాఘవేంద్ర స్వామి గురు వైభవోత్సవాలలో భాగంగా, మొదటి రోజు శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పండితుల వేద మంత్రాలతో మంగళ వాయిద్యాల నడుమ పీఠాధిపతుల చేతుల మీదుగా ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారని చెప్పారు. రెండవ రోజు శ్రీ రాఘవేంద్రుని 403 పట్టాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకుని, శ్రీ రాఘవేంద్ర స్వామి స్వర్ణ పాదకులకు, ముత్యాలు, పుష్పాలతో అభిషేకం నిర్వహించి భక్తులకు కనువిందు చేస్తారని పేర్కొన్నారు. శ్రీ రాఘవేంద్ర స్వామి జన్మదిన వేడుకలు సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని గురు వైభవోత్సవాలు తిలకించేందుకు ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు వివిధ రాష్ట్రాల నుంచి వివిధ శాఖల ఉన్నత స్థాయి అధికారులు, ప్రముఖులు హాజరుకానున్నారని ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన ప్రముఖులకు శ్రీ రాఘవేంద్ర స్వామి అనుగ్రహ ప్రశస్తి అవార్డులను ప్రదానం చేస్తారని తెలిపారు.

భారీగా కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - ఆదోని

భారీగా కర్నాటక మద్యంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదోని సెబ్ స్టేషన్ పరిధిలో ఆదోని మండలం కడితోట వద్ద కర్నాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఎస్ఐ విన్నీలత తెలిపారు. అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఆదివారం కడితోట వద్ద వాహనాల తనిఖీల్లో 40 బాక్సుల కర్నాటక మద్యం పట్టుకొని చిదానందం, నరసప్ప అనే ఇద్దరు నిందితులను అదుపులో తీసుకున్నట్లు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు ఇస్మాయిల్, వీరా స్వామి, కానిస్టేబుల్ సోమేశ్వర్ పాల్గొన్నారు.


అక్రమ మద్యంను చూపిస్తున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ జి. కృష్ణమూర్తి

మంత్రాలయం : కర్నాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జి.కృష్ణమూర్తి తెలిపారు. మాధవరం పోలీస్టేషన్ పరిధిలో గల చెక్ పోస్టు సమీపంలోని శ్రీకృష్ణదేవరాయ కాలువ వద్ద ఆదోని పట్టణానికి చెందిన బంధే అలీ అలియాస్ అస్లాం అనే వ్యక్తిని అరెస్టు చేసి, ఆయన నుంచి కర్నాటక మద్యం 25 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా కర్నాటక బాక్సులతో కూడిన 2400 పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. 90 ఎంయల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనంతో పాటు మద్యం తరలిస్తున్న ఎపి 21టివై 4255 నెంబర్ గల టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ప్రేమ స్వరూపిణి సావిత్రిబాయి పూలే

ప్రజాశక్తి - ఆదోని : మతాలకతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి సావిత్రిబాయి పూలే అని బిసి ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు కొనియాడారు. ఆదివారం ఆదోనిలోని బిసి ఫెడరేషన్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పిం చారు. దస్తగిరి నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్ గౌరవ సలహాదారుల ధణాపురం శేషనన్న, తాలూకా ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ షావలి, సలహాదారులు బి రాముడు, కపటి వీరభద్ర పట్టణ సలహా దారులు, అడ్వకేట్ వి.రామాంజనేయులు, మల్లేశ్వరప్ప, డాక్టర్ సోమశేఖర్, నల్లారెడ్డి,ఆయిల్ ప్రకాష్, కత్తి ప్రసాద్, కళ్యాణ్ పాల్గొన్నారు.


నివాళి అర్పించిన నాయకులు


సర్టిఫికెట్లు ఇచ్చిన దృశ్యం

వాగ్దేవి పాఠశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని : ఆదోనిలోని మల్లికార్జున స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి వేదిక్, అబాకస్ మ్యాథ్స్ పోటీలలో ఆదోనిలోని వాగ్దేవి స్కూల్ విద్యార్థిని సౌమ్య ప్రథమ, అబాకస్ మ్యాథ్స్‌లో విద్యార్థి సుకుమార్ ద్వితీయ స్థానాల్లో నిలిచారని హెచ్ఎం సురేష్ తెలిపారు. ఆదివారం పాఠశా లలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. పోటీ పరీక్షలు విద్యార్థుల్లో ఉన్న భయం తొలగిపోతుందన్నారు. ఈ కార్యక్రమ ంలో ఉపాధ్యాయులు మధు, శిరీష, నవ్య, అశ్విని, సంధ్య పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - నందవరం

మండల కేంద్రమైన నందవరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యా నిలయము నందు ఆన్లైన్ ద్వారా ఆరవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఎంపీసీ మాత్రమే) ప్రవేశాలకు బాలికలు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ ఆర్. శైలజ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఆరో తరగతి నందు 40 సీట్లు, ఏడవ తరగతి నందు ఒక సీటు, 9వ తరగతి నందు రెండు సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపు నందు 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 12 నుండి ఏప్రిల్ 11 వరకు https://a pkgbv.apcf-ss.in ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలకు పాఠశాల దగ్గర సమాచారం తీసుకోవాలన్నారు.

నేడు కనకదాసు విగ్రహావిష్కరణ



ప్రజాశక్తి - కౌతాళం

మండల కేంద్రమైన కౌతాళంలో కనకదాసు విగ్రహం సోమవారం ఆవిష్కరిస్తున్నట్లు కనకదాసు విగ్రహ కమిటీ అధ్యక్షులు శివరాం, ఎంపీపీ అమ్రేష్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ కనకదాసు విగ్రహ ప్రారంభోత్స వానికి మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆయన చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. ఈ విగ్రహం పంచ లోహాలతో రూ.ఆరు లక్షల 80 వేలతో తయారు చేయించడం జరిగిందన్నారు.





లక్ష్మీనరసింహస్వామి అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను తీసుకొస్తున్న మంత్రి ఆర్కే రోజా

డిఎస్‌సి నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు

- గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి
- డిఇఒ కె.సుధాకర్ రెడ్డి



ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'డిఎస్‌సి-2024 పరీక్ష నిర్వహణకు నంద్యాల జిల్లాలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 3 వరకూ రోజుకు రెండు సెషన్ల చొప్పున 10 సెషన్లలో సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 7న టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపల్ పోస్టులకు ప్రాథమిక పరీక్ష ఇంగ్లీష్ ప్రొఫిషియన్సీ టెస్టు నిర్వహిస్తారు. ఏప్రిల్ 13 నుంచి ఏప్రిల్ 30 వరకూ స్కూల్ అసిస్టెంట్, టీజీటీ, పీజిటి, ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ పరీక్షలను నిర్వహిస్తారు. ఈ నెల 20 నుంచి పరీక్షా రాయటానికి అభ్యర్థులకు సెంటర్లు ఎంచుకోవడానికి వెబ్ ఆప్షన్స్, 25 నుంచి అభ్యర్థులు హాల్ -టికెట్స్ డౌన్లోడ్ చేసుకోవచ్చు' అని జిల్లా విద్యాశాఖాధికారి కె.సుధాకర్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లాలో డిఎస్‌సి-2024 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలపై ఆదివారం ప్రజాశక్తితో ఆయన ముఖాముఖి మాట్లాడారు...

హాల్ టికెట్లను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి..?

డిఇఒ : ఉపాధ్యాయ నియామక పరీక్ష-2024కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏపీ డిఎస్సీ-2024 వెబ్‌సైట్ నుండి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

హాల్ టికెట్‌లో వివరాలు తప్పుగా ఉన్నట్లయితే ఎలా సరి చేసుకోవాలి..?

డిఇఒ : హాల్ టికెట్‌లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే వెంటనే జిల్లా విద్యాశాఖాధికారిని సంప్రదించాలి. అభ్యర్థి పేరు లేదా తండ్రి/ తల్లి/ భర్త పేరు పూర్తిగా తప్పుగా ఉన్నట్లయితే పదవ తరగతి సర్టిఫికెట్ లేదా సరైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించి పేరును సరి చేయడానికి దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులు కొత్త హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షాకేంద్రానికి వెళ్ళాలి. పరీక్షా కేంద్రం దగ్గర తప్పులు సరిచేయరు.

పరీక్షా కేంద్రంలోకి ఎంత సమయం వరకు అనుమతిస్తారు..?

డిఇఒ : ఉపాధ్యాయ నియామక పరీక్ష కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ కాబట్టి సాంకేతిక సమస్యలు నివారించడానికి అభ్యర్థులకు ముందస్తు సన్నద్ధత అవసరం. ఉదయపు సెషన్‌లో పరీక్ష రాసేవారిని ఉదయం 8 గంటల నుండి 9:00 గంటలలోగా, మధ్యాహ్నం పరీక్ష రాసేవారిని 12:30 నుండి 1:30 గంటలలోగా పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారు. ఈ సమయం దాటిన తర్వాత అభ్యర్థులను అనుమతించరు.

హాల్ టికెట్లో ఫోటో సరిగా లేకపోతే ఏమి చేయాలి..?

డిఇఒ : పరీక్షా కేంద్రం వద్ద బయోమెట్రిక్ హాజరు తీసుకునేటప్పుడు అధికారులు హాల్ టికెట్‌లో ఉన్న ఫోటోను అభ్యర్థితో సరిపోల్చుకుంటారు. ఫోటో సరిపోకపోయినా, పాతదిగా లేదా మసకగా ఉన్నా పరీక్షకు అనుమతించరు. ఈ సందర్భంలో సరైన ఫోటోను డిపార్ట్మెంటల్ అధికారికి చూపించి అనుమతి పొందవచ్చు.

పరీక్షా కేంద్రంలో కంప్యూటర్ సమస్యలు వస్తే ఏమి చేయాలి..?

డిఇఒ : పరీక్షా కేంద్రంలో అభ్యర్థికి కేటాయించిన కంప్యూటర్ పవర్ సప్లై, ఇంటర్నెట్ సౌకర్యం సరిగా ఉన్నాయో లేదో. పరిశీలించుకోవాలి ఏదైనా సమస్య ఉన్నట్లయితే వెంటనే డిపార్ట్మెంటల్ అధికారికి, టెక్నికల్ అసిస్టెంట్‌కు తెలియజేయాలి.

అభ్యర్థి తనకు అనుకూలమైన సెషన్‌లో పరీక్షకు హాజరు కావడం కుదురుతుందా..?

డిఇఒ : అభ్యర్థి దరఖాస్తు ఫారంలో దరఖాస్తు చేసుకున్న సబ్జెక్టు, మీడియం ఆధారంగా సెషన్ కేటాయిస్తారు. హాల్ టికెట్‌లో తెలియజేసిన సమయం సెషన్‌లో మాత్రమే అభ్యర్థిని పరీక్ష రాయడానికి అనుమతిస్తారు.

స్క్రైబ్ సౌకర్యం పొందడం ఎలా ?

డిఇఒ : వికలాంగులైన అభ్యర్థులు తమ దరఖాస్తు ఫారంలో నమోదు చేసుకున్న వివరాలను బట్టి దృష్టి లోపం, రెండు చేతులు లేని అభ్యర్థులకు మాత్రమే స్క్రైబ్ సౌకర్యం ఉంటుంది. స్క్రైబ్‌ను డిపార్ట్మెంట్ కేటాయిస్తుంది. అభ్యర్థులు తమకై తాము తెచ్చుకోవడానికి అనుమతి లేదు. పరీక్ష రాసే అభ్యర్థులకు ప్రతి గంటకు 20 నిమిషాల చొప్పున సమయం ఇస్తారు. అభ్యర్థి వికలాంగుల వివరాలను దరఖాస్తులో నమోదు చేయనట్లయితే జిల్లా విద్యాశాఖాధికారి తుది నిర్ణయం తీసుకుని స్క్రైబ్‌ను అనుమతించవచ్చు.

టెట్-2024 అభ్యర్థులకు డిఎస్‌సి రాయడానికి అర్హత ఉందా..?

డిఇఒ : టెట్ 2024 రాసిన అభ్యర్థులు డీఎస్సీ 2024కు హాజరు కావచ్చు. టెట్‌లో కనీస అర్హత సాధించిన అభ్యర్థులకు మాత్రమే డీఎస్సీకి అర్హత ఉంటుంది.

ఇంగ్లీష్ నైపుణ్య పరీక్ష రాయవలసిందేనా..?

డిఇఒ : ఇంగ్లీష్ నైపుణ్య పరీక్ష కేవలం ప్రిన్సిపల్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే రాయాలి. వీరు ఇంగ్లీష్ ప్రొఫెషియన్సీ టెస్ట్‌లో అర్హత సాధిస్తేనే రెండో పేపర్ రాయడానికి అనుమతిస్తారు.

స్కూల్ అసిస్టెంట్, టీజీటీ పోస్టులకు ఒకే పరీక్ష ఉంటుందా..?

డిఇఒ : స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులకు విడివిడిగా పరీక్షలు నిర్వహిస్తారు. సిలబస్ ఒకే విధంగా ఉంటుంది. పరీక్షలు విడివిడిగా నిర్వహిస్తారు.

హాల్ టికెట్‌లో వివరాలు తప్పుగా ఉన్న అభ్యర్థులను పరీక్షా కేంద్రానికి నేరుగా అనుమతిస్తారా..?

డిఇఒ : పేరు, పరీక్షా కేంద్రం మార్పు కోసం జిల్లా విద్యాధికారి వద్ద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ పరీక్ష తేదీకి కనీసం రెండు రోజుల ముందుగా వెబ్ సైట్‌లో చెక్ చేసుకుంటూ ఉండాలి. పరీక్ష సమయం దాకా ఎదురు చూడకూడదు. పేరు పూర్తిగా తప్పు వచ్చిన అభ్యర్థులకు పరీక్ష కేంద్రంలో పేరు మార్చడం జరగదు. వారిని నేరుగా పరీక్షకు అనుమతించరు.

ఒక అభ్యర్థి వేర్వేరు పోస్టులకు దరఖాస్తు చేసుకున్నప్పుడు అన్నింటికి కలిపి ఒకే హాల్ టికెట్ వస్తుందా..?

డిఇఒ : అభ్యర్థి ఎన్ని పోస్టులకు దరఖాస్తు చేస్తే అన్ని హాల్ టికెట్స్ విడివిడిగా వస్తాయి. కాబట్టి ఏ పరీక్షకు కేటాయించిన హాల్ టికెట్‌తో ఆ పరీక్షకు మాత్రమే హాజరు కావాలి. ఉపాధ్యాయ నియామక పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సూచనలు పాటించి ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా చూసుకోవాలి.



అహోబిలంలో మంత్రి ఆర్కే రోజా

- రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పణ
- హాజరైన నంద్యాల ఎంపీ పోచా, మాజీ విప్ గంగుల

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి అమ్మవార్లను రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా ఆదివారం దర్శించుకున్నారు. అహోబిలం పారువేట ఉత్సవాలను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన విషయం విదితమే. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు అందించేందుకు వచ్చిన మంత్రి ఆర్కే రోజా, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జల వనరుల శాఖ రాష్ట్ర గౌరవ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డిలకు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు, అర్చక బృందం, మఠం అధికారులు జిపిఎ సంపత్, ఓఎస్‌డి శివప్రసాద్, కమ్యూనికేషన్ అధికారి సేతురామన్‌లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రహ్లాద వరద స్వామికి పట్టు వస్త్రాలు, సారే మంత్రి రోజా అందజేశారు. అనంతరం ఆలయంలో కొలువైన ప్రహ్లాద వరద స్వామి, అమృతవల్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో మంత్రి రోజా, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జల వనరుల శాఖ రాష్ట్ర గౌరవ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డిలను ప్రధాన అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించి నవనారసింహుల చిత్రపటాన్ని బహుకరించారు.



మంత్రి ఆర్కే రోజాకు నరనారసింహుల చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు తదితరులు

అనంతరం మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ అహోబిల క్షేత్రం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అహోబిల దేవస్థానం అభివృద్ధికి ఇప్పటికే రూ. 25 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత అహోబిల క్షేత్రానికి వస్తానని, అప్పుడు కాలినడకన నవ నరసింహ క్షేత్రాలను దర్శించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, ఆళ్లగడ్డ సొసైటీ అధ్యక్షులు ఇంజేటి శివ శంకర్ రెడ్డి, నాయకులు శివనాగిరెడ్డి, ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, గంగుల రామిరెడ్డి, ఎలక్ట్రికల్ డిఈఈ రవికాంత్ చౌదరి, కూలూరు నరసింహారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సిఐ హనుమంతు నాయక్, ఎస్ఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో 'పూర్ణాహుతి'



బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న వేద పండితులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం పూర్ణాహుతి కార్యక్రమం దేవస్థానం వారు నిర్వహించారు. 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో పదో రోజు యాగశాలలో చండీశ్వర పూజ, రుద్ర హోమం, చండీహోమం వంటి పూజలు నిర్వహించారు. ఆతరువాత యాగ పూర్ణాహుతి, వసంతోత్సవం, అవబృదం, త్రిశూల స్నానం వంటివి జరిపించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు, సుగంధ ద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు మొదలైన వాటిని హోమగుండంలో ఆహుతిగా సమర్పించి యాగ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అనంతరం జరిగిన వసంతోత్సవంలో ఆలయ అర్చకులు, వేదపండితులు వసంతాన్ని భక్తులపై చల్లారు. అవబీదం స్నానం కార్యక్రమంలో చండీశ్వర స్వామికి పుష్కరిణి స్నానం పూజలు నిర్వహించారు. చివరగా త్రిశూల స్నానం నిర్వహించారు. సాయంకాలం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని జరిపించారు. అనంతరం నిత్య కళ్యాణ మండపంలో సదస్యం, నాగవల్లి కార్యక్రమాన్ని వేదపండితులు చతుర్వేద పారాయణలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చక్రపాణి రెడ్డి దంపతులు, కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు దంపతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- సిఐటియు, ఐద్వా, యుటిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే దేశం అభివృద్ధి వైపు ముందుకెళ్తుందని మహిళా దినోత్సవం కార్యక్రమంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణం లోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో సిఐటియు, ఐద్వా, యుటిఎఫ్ కమిటీల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, ఐఎంఏ అధ్యక్షురాలు వసుంధర రాణి, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ క్రాంతి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు టి.నిర్మల మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను ప్రభుత్వాలు అరికట్టడంలో విఫలం చెందాయని అన్నారు. మహిళలపై దాడులకు, అత్యాచారాలకు పాల్పడిన వెంటనే నిందితులపై కఠిన చర్యలు తీసుకుపోవడం వలన అకృత్యాలు రోజురోజుకు మరింతగా పెరుగుతున్నాయని చెప్పారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై ప్రతి గంటకు ఎక్కడో ఒకచోట దాడులు, అత్యాచారం జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యతనివ్వాలని, సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు పోవాలని, పురుషులు కూడా మహిళలకు సహకారం అందించాలని కోరారు. మహిళలను చులకనగా చూడకూడదని, మహిళలకు ఉండే ప్రతి బాధలోనూ పురుషులు పాల్పంచుకుని సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పివి ప్రసాద్, జిల్లా సహాధ్యక్షురాలు శాంతి ప్రియ, నాయకురాలు షమీంబాను, సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, ఉపాధ్యక్షులు తోట మద్దులు, జిల్లా కార్యదర్శి పి.వెంకట లింగం, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి సునీత, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమణకుమారి, పట్టణ కార్యదర్శి షమీమ్, వివోఏ యూనియన్ జిల్లా కార్యదర్శి తిరుపతయ్య, మధ్యాహ్నం భోజనం యూనియన్ జిల్లా నాయకురాలు ఈశ్వరమ్మ, పలువురు మహిళలు పాల్గొన్నారు.





జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

14న జాబ్ మేళా

- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి
- డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి - డోన్ : డోన్ పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 14వ తేదీ గురువారం ఉదయం 9:30 గంటలకు నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కోరారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జాబ్ మేళా పోస్టర్లను మున్సిపల్ చైర్మన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని కోరారు. సమయం వృధా చేసుకోకుండా భవిష్యత్తు ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. డోన్‌లో నిర్వహించే జాబ్ మేళాకు అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొని వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్‌లు హరికిషన్, జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు మహేశ్వర రెడ్డి, ఆర్ట్ రమణ, వెంకటరాముడు, ఉమా మహేశ్వరి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

14న ఛలో ఢిల్లీ

- విజయవంతం చేయండి :కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి నంద్యాల కలెక్టరేట్ : కనీస మద్దతు ధర కోసం ఈ నెల 14వ తేదీన చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని రైతులు, కౌలు రైతులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.మార్క్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాల వలన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా పోతుందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వంపైన ఒత్తిడి తెస్తే రైతులను, నాయకులను ఎక్కడికక్కడే నిర్బంధం, అరెస్టులు చేయడం సరైంది కాదన్నారు. స్వామినాథన్ సిఫారసు ప్రకారం మద్దతు ధర చట్టాలను అమలు చేయాలని, సాగు చేసుకుంటున్న కౌలు రైతులను గుర్తించి నెలవారీగా పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతులకు, కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని. కార్మికుల కనీస వేతనం ఇవ్వాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దినసరి కూలీ 600 రూపాయలు ఇవ్వాలని డిమాడ్ చేశారు.

ఇరువురి మధ్య కుదిరిన సయోధ్య

- ఫరూక్‌తో కలిసి పని చేసేందుకు భూమా గ్రీన్ సిగ్నల్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల నియోజకవర్గం టిడిపిలో నెలకొన్న విబేదాలకు తెర పడింది. ఎన్ఎండి ఫరూక్‌కు నంద్యాల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా టిడిపి అధిష్టానం ప్రకటించినప్పటి నుండి మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆయనతో కలిసి పని చేసేందుకు సుముఖత చూపలేదు. ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తూ వచ్చారు. విడివిడిగా కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చారు. ఫరూక్ వెళ్లి కలిసి పని చేద్దామని సంకేతాలు ఇచ్చినప్పటికి ససేమిరా అన్న భూమా వైఖరితో కార్యకర్తల్లో గందరగోళం ఏర్పడింది. నంద్యాలలో గెలిచే సీటు పోగొట్టుకుంటున్నామా అనే అభిప్రాయం అ పార్టీ శ్రేణుల్లో నెలకొని ఉండేది. భూమా అనుచరులు ఫరూక్ వైపు వెళితే తమ నాయకుడు కోప్పడుతాడనే ఆలోచనతో ఉంటూ వస్తున్నారు. అయితే ఇటీవలే నేరుగా చంద్రబాబు నాయుడు భూమా బ్రహ్మానందరెడ్డికి ఫోన్ చేసి నంద్యాలలో టిడిపి, ఫరూక్ గెలుపునకు కృషి చేయాలని, టిడిపి ప్రభుత్వం వచ్చాక తప్పక సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఇదే క్రమంలో ఆదివారం నంద్యాల టిడిపి అభ్యర్థి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డితో జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చర్చలు జరిపారు. ఇదరు నేతల మధ్య సయోధ్యను కుదిర్చారు. ప్రభుత్వం వచ్చాక తగిన గౌరవం కల్పిస్తామని భూమా బ్రహ్మానందరెడ్డికి లోకేష్ హామీ ఇవ్వడంతో ఎన్ఎండి ఫరూక్‌తో కలిసి పనిచేసేందుకు ఒప్పుకున్నట్లు పార్టీ శ్రేణులు ప్రకటించాయి. దీంతో నంద్యాల రాజకీయం మారనుంది. భూమా, ఫరూక్ కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే గెలుపోటములు తారుమారు అయ్యే పరిస్థితి ఉంటుందని, టిడిపి సునాయసంగా గెలిచే అవకాశాలు మెండుగా ఉంటాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



నారా లోకేష్‌తో ఎన్ఎండి ఫరూక్, భూమా బ్రహ్మనందరెడ్డి

రమణీయం రథోత్సవం

మహానంది, యాగంటి, ఓంకారం, దుర్గా భోగేశ్వరం క్షేత్రాల్లో రథోత్సవాలు
అశేష భక్తజన సందోహంతో కిక్కిరిసిన ఆలయాలు



మహానందిలో రథోత్సవ దృశ్యం

ప్రజాశక్తి - మహానంది

ప్రముఖ శైవ క్షేత్రం మహానందిలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని కామేశ్వరీ దేవి సమేత మహానందీశ్వర స్వామి రథోత్సవం ఆదివారం కన్నుల పండుగగా సాగింది.ఉదయం క్షేత్రంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథశాల వద్ద వేదపండితులు, రుత్వికులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథాంగబలి, బలిహరణ, కొబ్బరికాయ, గుమ్మడికాయలు రథం వద్ద కొట్టి వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాల అనంతరం ఆలయంలోని ప్రధాన రాజగోపురం గుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీలో తీసుకొని వచ్చి రథంపై ఆశీనులు చేశారు. అనంతరం రథశాల వద్ద ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, వేద పండితులు కొబ్బరికాయలు కొట్టి అశేష జనవాహిని మధ్య రథోత్సవాన్ని ప్రారంభించారు. రథాన్ని భక్తులు ఆలయ మాడ వీధుల గుండా లాగుతూ భక్తిని చాటుకున్నారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్కభజన, మంగళ వాయిద్యాల నడుమ అశేష జన వాహిని మధ్య క్షేత్ర మాడవీధుల్లో రథోత్సవం నయనానందకరంగా సాగింది.

వైభవంగా యాగంటిలో రథోత్సవం

బనగానపల్లె : బనగానపల్లె మండలంలోని యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఆలయ ప్రత్యేకాధికారి పాండురంగారెడ్డిల ఆధ్వర్యంలో రథోత్సవం కనుల పండుగగా జరిగింది. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ దోనపాటి యాగంటి రెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి, ఉమామహేశ్వరస్వామి నిత్యాన్నదాన సంస్థ కార్యదర్శి మల్కిరెడ్డి దస్తగిరి రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ, కిషోర్ శర్మ, సత్యనారాయణ శర్మ, రాఘవేంద్ర శర్మ పాల్గొన్నారు. సిఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్సై రామిరెడ్డి, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కన్నుల పండగగా దుర్గా భోగేశ్వరుడి రథోత్సవం

గడివేముల : గడివేముల మండలం గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గా భోగేశ్వర స్వామి రథోత్సవం కన్నుల పండుగగా జరిగింది. దుర్గా భోగేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను రథోత్సవంపై ఉంచి పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ చైర్మన్ సునీల్ కుమార్ రెడ్డి, ధర్మకర్త మండలి, భక్తులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గడివేముల ఎస్సై బిటి వెంకటసుబ్బయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు.

రమణీయంగా ఓంకారేశ్వరుని రథోత్సవం

బండి ఆత్మకూర్ : నల్లమల అభయారణ్యంలో వెలసిన ఓంకార సిద్దేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం కన్నుల పండుగగా జరిగింది. ఈ రథోత్సవానికి అర్చకులు, ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఆలయ అధికారి నాగ ప్రసాద్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేశు వెంకట్రాంరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశిరెడ్డి నాయన నిత్యాన్నదాన సత్రం నుండి మేళతాళాలతో ప్రసాదాలను తీసుకువచ్చి కాశిరెడ్డి అన్నదాన నిర్వాహకులు పెప్సీ నాగేశ్వర్ రెడ్డి, బారెడ్డి శ్రీనివాసరెడ్డి, ముడుమేల పుల్లారెడ్డి, అల్లే చెన్నారెడ్డి, పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవం ప్రారంభించారు. వేలాదిమంది భక్తజనం రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్సై మల్లికార్జున ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారుర.



బనగానపల్లె : యాగంటిలో రథాన్ని లాగుతున్న భక్తులు



గడివేముల : దుర్గా భోగేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న ప్రజలు

బండి ఆత్మకూరు : ఓంకార క్షేత్రంలో రథోత్సవం





సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర సమరయోధులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసీపీ నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డిలు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల పోరాటం వల్లనే నేడు మనం స్వాతంత్ర ఫలాలను అనుభవిస్తున్నామని తెలిపారు. ఈడిగ, గౌడ కులస్తులు ఐకమత్యంతో తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. గౌడ కులస్తులకు ఏ సమస్య వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు దేవుడు గౌడ్, రమణ గౌడ్, తిరుపాల్ గౌడ్, వాయునందన గౌడ్, వెంకటేశ్వర్లు గౌడ్, పసిపాల సర్పంచ్ మూల మోహన్ బాబు గౌడ్, దొంత వెంకటేశ్వర్లు, కృష్ణయ్య గౌడ్, బత్తిన మద్దిలేటి గౌడ్ తదితరులుపాల్గొన్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం-స్పందన'

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్ లోని వైఎస్ఆర్ సెంటినరీ హాలులో వినూత్న తరహాలో 'జగనన్నకు చెబుదాం - స్పందన' నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నేడు ఉదయం 9-30 గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆత్మకూరులో వెలసిన చలువ పందిర్లు

ప్రజాశక్తి - ఆత్మకూరు : ఎండలు మండుతున్న నేపథ్యంలో ఆత్మకూరు పట్టణంలో వాణిజ్య సముదాయాల ముందు యజమానులు చలువ పందిర్లు వేయిస్తున్నారు. ఒక్కొక్క దుకాణ యజమాని దాదాపు నాలుగు వేల రూపాయలు ఖర్చు పెట్టి 10 నుండి 15 దుకాణాల వారు వెదురు తడికలతో చలువ పందిళ్లను వేయిస్తున్నారు. ఆత్మకూరు పట్టణంలో నిత్యం రద్దీగా ఉన్న కప్పలకుంట వీధిలో ఎక్కువగా ఈ చలువ పందిళ్లు దర్శనమిస్తాయి. దుకాణాలకు వచ్చే వినియోగదారులకు చల్లటి నీడను కల్పించేందుకు యజమానులు ఈ చలువ పందిర్లు వేయించారు. కాస్త ఆలస్యమైనా తమ దుకాణాల వ్యాపారం కోసం వచ్చినవారు నీడలో ఉండేందుకు యజమానులు ఈ కొత్త ఆలోచన విధానాన్ని చేపడుతున్నారు. ఎండ నుండి రక్షణ పొందేందుకు ప్రజలు సైతం ఈ వీధిలో వెళ్లేందుకు ఎక్కువగా ఇష్టపడుతున్నారు.



కప్పలకుంటలో వాణిజ్య సముదాయాల ముందున్న చలువ పందిర్లు

స్వామినాథన్ కమిషన్ అమలు చేయాలి

- పంటల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలి
- సీమ సాగునీటి ప్రాజెక్టులకు అత్యధిక నిధులు కేటాయించాలి
- రైతన్న ఉద్యమానికి సంఘీభావ కార్యక్రమంలో బొజ్జా దశరథరామిరెడ్డి

మాట్లాడుతున్న బొజ్జ దశరథ రామిరెడ్డి



ప్రజాశక్తి - నంద్యాల

స్వామినాథన్ కమిషన్ అమలు చేయాలని, పంటల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి డిమాండ్ చేశారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు బడ్జెట్లో అత్యధిక నిధులు కేటాయించాలన్నారు. కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా రైతులు చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా ఆదివారం నంద్యాల పట్టణం గాంధీ చౌక్‌లోని గాంధీ విగ్రహం దగ్గర రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. సమితి కార్యాలయం నుండి ఊరేగింపుగా బయలుదేరి శ్రీనివాసనగర్ సెంటర్ మీదుగా గాంధీ చౌక్ వరకు జరిగిన ర్యాలీలో గోస్పాడు, నంద్యాల, బండిఆత్మకూరు, మహానంది, గడివేముల, పాణ్యం మండలాల నుండి రైతు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గాంధీ చౌక్ లో మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళ అర్పించిన అనంతరం జిల్లా అధ్యక్షులు లాయర్ నాగక్రిష్ణా రెడ్డి అధ్యక్షతన జరిగిన సంఘీభావ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని చలో ఢిల్లీకి పిలుపునిచ్చిన పంజాబ్ రైతులను, హర్యానా సరిహద్దులలో నిలువరించి వారిపై డ్రోన్లతో, ప్లాస్టిక్ బుల్లెట్లతో దాడి చేసి ఒక యువ రైతు మరణానికి, అనేక మంది రైతులు గాయాలపాలు చేయడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ నివేదికను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ సాగునీటి నిర్మాణాలలో సమానాభివృద్ధికి నిధుల కేటాయింపులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు బెక్కం కృష్ణా రెడ్డి, చిన్న రామకృష్ణా రెడ్డి, శంకర రావు, ఈశ్వర రెడ్డి, రామ సుబ్బారెడ్డి, కాసిం, భూసి రెడ్డి, సదాశివా రెడ్డి, యుగంధర్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు అడ్వకేట్ శంకరయ్య, షఫీ, పాండే, షణ్ముఖ, రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వైఎన్ రెడ్డి, ఏర్వ రామచంద్రారెడ్డి, కార్యదర్శి మహేశ్వర రెడ్డి, ప్రజా సంబంధాల కార్యదర్శి సుధాకర్, కార్య నిర్వాహక సభ్యులు శ్రీహరి, పర్వేజ్, భాస్కర రెడ్డి, సౌదాగర్ ఖాసిం మియా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాశీ చంద్రమౌళీశ్వర రథోత్సవం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మండలం కొత్త బిజినవేముల గ్రామంలో కాశీ చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి పండుగను పురస్కరించుకొని ఆదివారం సర్పంచ రవి యాదవ్ ఆధ్వర్యంలో కాశీ చంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పబ్బతి రవి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, ఓంకార్ రెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రథోత్సవం ప్రారంభిస్తున్న దృశ్యం

హోరాహోరీగా బండలాగుడు పోటీలు : కాశీ చంద్రమౌళీశ్వరస్వామి తిరుణాల మహోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ రవి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృషభ బండలాగుడు పోటీలు హెూరాహెూరీగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలలో కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు చిన్న మద్దయ్య వృషబాలు మొదటిస్థానంలో నిలిచి రూ. 40 వేలు అందుకున్నాయి రెండోస్థానంలో తెలంగాణ రాష్ట్రం నారయణపేట జిల్లా మరికల్ మండలం జక్కిలేరు గ్రామం రషీద్ బాష వృషబాలు నిలిచి రూ.30 వేలు కైవసం చేసుకున్నాయి. కర్నూలు జిల్లా రుద్రవరానికి చెందిన ఎల్లగౌడ్ వృషభాలు మూడో స్థానంలో నిలిచి రూ.20 వేలను, 4వ బహుమతి రూ.10 వేలు పెద్ద కడబూరు మండలం నెమలికల్ గ్రామ కాశీంవలి వృషభాలు గెలుచుకున్నాయి. ఐదవ బహుమతి భూమా భీంరెడ్డి వృషభాలు రూ.8 వేలు, ఆరో బహుమతిని రూ.5 వేలు కొణిదెల బత్తుల జనార్ధన్ వృషభాలు గెలుచుకున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ జబ్బర్, వైస్ ఎంపీపీ పబ్బతి రవి, శ్రీనంది జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బద్దుల శ్రీకాంత్, శ్రీరాములు, బాలకృష్ణ, నాగరాజు, వెంకటేశ్వర్లు, మహమ్మద్ రఫీ, బాబూలాలు, బాలేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

బండలాగు పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు



ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కృషి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణ పరిధిలో రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే తమ లక్ష్యమని పట్టణ సీఐ రమేష్ బాబు అన్నారు. ఆదివారం నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు, ఆళ్లగడ్డ డి.ఎస్.పి షేక్ షర్ఫుద్దిన్ సూచనలతో ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామమైన పెద్ద చింతకుంట్ల, దేవరాయపురం గ్రామాలతో పాటు పట్టణంలోని పాత బస్టాండు, బాలాజీ నగర్ , తోమ్మంద్రు వీధి, నాలుగు రోడ్ల జంక్షన్, కొత్త బస్టాండు, ఏసునాధపురం తదితర కాలనీలలో పోలీసుల కవాతు నిర్వహించారు. బిఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వరిందర్ కుమార్, ఆళ్లగడ్డ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.రమేష్ బాబు, సబ్ ఇన్స్పెక్టర్ కే పి బి.వెంకట్ రెడ్డి , బిఎస్ఎఫ్ సిబ్బంది, ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ సిబ్బంది తో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ రమేష్ బాబు మాట్లాడుతూ ఎన్నికను ప్రశాంతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించి ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పోలీసులు ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రౌడీషీట్ ఉన్న వ్యక్తులు సంఘవిద్రోహ చర్యలకు పాల్పడకుండా హెచ్చరించామన్నారు. కాలనీలలో ప్రజలకు ఎన్నికల గురించి అవగాహన నిర్వహించామన్నారు. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగట్టి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని ప్రజల్లో భరోసా కల్పించామన్నారు. ఎలాంటి సమస్య ఉన్న పోలీసుల దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు.



ఆళ్లగడ్డ పట్టణంలో బీఎస్ఎఫ్ దళాలతో పోలీసుల కవాతు

పొత్తు.. పార్టీల కోసం కాదు..

- శ్రీశైలం అసెంబ్లీ టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర రెడ్డి



ప్రజాశక్తి - ఆత్మకూరు : టిడిపి, బీజేపీ, జనసేన పార్టీల పొత్తు ఓ చారిత్రాత్మక ఘట్టమని, ఈ కలయిక పార్టీల కోసం కాదని, రాష్ట్ర భవిష్యత్ కోసమని, తమ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, శ్రీశైలం అసెంబ్లీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నాయన డానికి ఈ పొత్తు ఓ నిదర్శనమన్నారు. వైసీపీ నిరంకుశ పాలన అంతమొందించటానికి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్‌లు ఒక్కటయ్యారని చెప్పారు. రాష్ట్ర విభజన నష్టం కన్నా.. సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలోనే ఎక్కువ నష్టం జరిగిందన్నారు. సచివాలయాన్ని తాకట్టు పెట్టి దుర్మార్గమైన పాలన చేస్తున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. టీడీపీ, బీజేపీ, జనసేన కలయిక రాష్ట్ర ప్రజలకు శుభ పరిణామమని, ఈ పొత్తును ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

పోలీస్ స్టేషన్లకు చేరిన 'పది' ప్రశ్నపత్రాలు

ప్రజాశక్తి - రుద్రవరం : 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు ఆదివారం రుద్రవరం పోలీస్ స్టేషన్‌లో భద్ర పరిచినట్లు ఇన్చార్జి ఎంఈఓ కోటయ్య, కస్టోడియన్ అధికారి-1, సుబ్బరాయుడు, కస్టోడియన్-2 అధికారి బాల గురప్ప తెలిపారు. ఈ నెల 18 నుండి 30వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జడ్పిహెచ్ఎస్ స్కూల్ రుద్రవరం, నరసాపురంలోని థామస్ మార్తోమ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 512 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. **కొత్తపల్లి :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్న పత్రాలు కొత్తపల్లి పోలీస్ స్టేషన్కు చేరాయి. పరీక్షల నిర్వహణ అధికారులు ఇబ్రహీమ్, రఘుస్వామిలు ప్రశ్నపత్రాలను పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని రెండు సెంటర్లలో 370 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. గోకవరం సెంటర్‌లో 130, కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నందు 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. డిపార్ట్మెంటల్ అధికారులు ఖాజామోహిద్దీన్, సురేంద్రసింగ్‌లు పాల్గొన్నారు.

స్మశాన వాటికలో మినీ ట్యాంకు ఏర్పాటు

ప్రజాశక్తి - రుద్రవరం

మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలోని స్మశాన వాటికలో నీటి సౌకర్యం కల్పించేందుకు గ్రామ సర్పంచి పాణ్యం లక్ష్మీదేవి మినీ వాటర్ ట్యాంక్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ సచివాలయమండల కన్వీనర్ పాణ్యం నాగేష్ మాట్లాడుతూ స్మశానంలో నీటి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు స్మశానం వద్దకు వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతుండేవారిని, నీటి సౌకర్యం కల్పించేందుకు గ్రామపంచాయతీ నిధులతో మినిట్యాకు ఏర్పాటు చేశామన్నారు. నీటి సౌకర్యం కల్పించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మినీ వాటర్ ట్యాంకు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాఠశాల

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

ప్రజాశక్తి - పగిద్యాల : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపల్ వెంకటరమణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలోని లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఐదవ తరగతి ప్రవేశ పరీక్షకు 555 మంది విద్యార్థులకు గాను 402 మంది విద్యార్థులు హాజరయ్యారున్నారు. 153 మంది విద్యార్థులు గైరాజరైనట్లు తెలిపారు. జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షకు 517 మంది గాను 445 మంది విద్యార్థులు హాజరయ్యారని, 72 మంది గైర్హాజరయినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల పర్యవేక్షకులుగా సృజన, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు

ప్రజాశక్తి - పగిద్యాల

పగిద్యాల మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సృజన ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. అత్యుత్తమ విద్యా పరిమాణాలతో తమ బోధనతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మోడల్ స్కూల్లో విద్యాబోధన ఉందన్నారు. మోడల్ స్కూల్ 6వ తరగతి ఇంగ్లీష్ మీడియం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 5వ తరగతి చదువుతున్న విద్యార్థులై ఉండాలన్నారు. ఓసి, బీసీ విద్యార్థులు సెప్టెంబర్ 1వ తేదీ 2012 నుండి ఆగస్టు 31వ తేదీ 2014 మధ్య జన్మించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీలు సెప్టెంబర్ 1వ తేదీ 2010 నుండి ఆగస్టు 31 వ తేదీ 2014 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసి, బీసీలు రూ.150 , ఎస్సీ, ఎస్టీలు రూ75 పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం వాటిని ప్రింట్ తీసుకొని ఆధార్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను జత చేసి పగిద్యాల మోడల్ స్కూల్‌లో అందచేయాలన్నారు. ఈ నెల 3వ తేదీ నుండి 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 21వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ జెడ్పిటిసి మృతి

ప్రజాశక్తి - చాగలమర్రి : చాగలమరి మండలం మూడు రాళ్లపల్లె గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి పులి వీరమ్మ(80) ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి గ్రామానికి చేరుకుని పులి వీరమ్మ భౌతికకాయంపై పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. భూమా కుటుంబం అన్నివేళలా బాధిత కుటుంబానికి అందుబాటులో ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, నాయకులు హరిచంద్ర రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, మూడు రాళ్లపల్లె గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రైతులు బాగుంటేనే దేశం సుభిక్షం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

- హోరాహోరీగా ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

ప్రజాశక్తి - మహానంది

రైతులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. ఆదివారం.మహానంది క్షేత్రంలో రెండవ రోజు జాతీయ ఒంగోలు జాతి వృషభ రాజుల బండ లాగుడు పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఎద్దుల యజమానులను శాలువాతో సత్కరించి, మెమొంటో బహుకరించి, చలకాల చేతపట్టి పందెం దూలం ఎక్కి పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే సంవత్సరం పోటీలలో విజేతలకు బహుమతులు ఇంకా పెంచుతానని అన్నారు. మహానంది క్షేత్రాన్ని సుందరంగా, అద్భుతంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో అటు ప్రభుత్వం నిధులతోనే కాకుండా తన సొంత డబ్బుని సైతం ఖర్చు పెడుతున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు,రైతు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఎద్దుల బల ప్రదర్శన పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలను ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో పెసర వాయి గ్రామానికి చెందిన ఏసన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఏటా మహాశివరాత్రి సందర్భంగా ఓంకార సిద్దేశ్వర స్వామి సన్నిధిలో ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఎద్దుల బలప్రదర్శన పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



ఓంకారంలో సీనియర్ విభాగం ఎద్దుల బలప్రదర్శన పోటీలు ప్రారంభిస్తున్న ఏసన్న

మహనీయురాలు సావిత్రిబాయి పూలే

- సిపిఎం మాస్ లైన్ ప్రజాపంథా, ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

భారతదేశంలో మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా, బడుగు బలహీన వెనుకబడిన జాతుల వారికి విద్యా బోధన చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని సిపిఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా, ఐఎఫ్‌టియు, పిఒఎల్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం సుండిపెంట కాలనీలోని భగత్ సింగ్ కాలనీలో సిపిఎంఎల్ మాస్ లైన్ ప్రజా పందా, ఐఎఫ్టియు, పిఒఎల్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు. అనంతరం ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు మండల నాయకుడు వై.శీను, పి.మల్లికార్జున, అచ్చమ్మ, శివాని, అబ్బాస్, వెంకటేష్, మల్లమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి గంగుల కుటుంబానికే సాధ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

ఆళ్ళగడ్డ నియోజకవర్గ అభివృద్ధి గంగుల కుటుంబానికే సాధ్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో రూ.12 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. మండలంలోని పెద్దబోధనం నుండి తోడేండ్లపల్లి బిటి రోడ్డును, ఎం. తండా, చక్రవర్తుల పల్లె, తోడేండ్లపల్లె, ముత్యాలపాడు, ఓజీ తాండ, డి.కొత్తపల్లి, చాగలమర్రి, పెద్ద వంగలి, చిన్న వంగలి గ్రామాలలో సిమెంటు రోడ్లను ప్రారంభించారు. అలాగే చాగలమర్రిలో గ్రామ సచివాలయ భవనాలను, పెద్దవంగలిలో రైతు భరోసా కేంద్రాన్ని, డి వనిపెంటలో గ్రామ సచివాలయ భవనాన్ని, చెంచుగూడెం వద్ద భవనాసి నదిపై కొత్తగా నిర్మించిన వంతెనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు, జడ్పిటిసి లక్ష్మిదేవి, జేసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ బాబూలాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, రాష్ట్ర సేవాదల్ కార్యదర్శి రమణ, పిఆర్ డిఈ నరసింహులు, ఏఈలు కొండారెడ్డి, జయన్న, సర్పంచ్‌లు గోవిందయ్య, శంకరమ్మ, బాలీశ్వరరెడ్డి, తులసమ్మ, బంగారు షరీఫ్, శివమ్మ, మౌళిబాష, ఎంపిటీసీలు పత్తి నారాయణ, వెంకటరాముడు, శంకరిబాయి, నరసింహులు, లక్ష్మిరెడ్డి, ఫయాజ్, వైసిపి నాయకులు శేషురమేష్, శ్రీనివాసులు, రహమాన్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రవి, సుబ్బయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి గణేష్ రెడ్డి, రహమాన్, జబ్బార్, రాముడు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సిసి రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణంలోని పలు కాలనీలలో సీసీ రోడ్లను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆదివారం ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా వెంగళ రెడ్డి నగర్ నందు రూ. 5లక్షలతో, లక్ష్మీ నగర్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో రూ. 7లక్షల 60వేలతో వేసిన సీసీ రోడ్డులను ప్రారంభించారు. అదేవిధంగా ఈద్గా దగ్గరా జడ్పి.డి.యఫ్ నిధులతో రూ. 5 లక్షలతో వేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

చెంచు విద్యార్థుల వసతి గృహాలకు నిధులు మంజూరు

శ్రీశైలం నియోజకవర్గంలోని బండి ఆత్మకూరు నారపు రెడ్డి కుంట 100 మంది చెంచు విద్యార్థులకు వసతి గృహం కోసం రూ. 2 కోట్ల 75 లక్షలు, జమ్మి నగర్ గట్టు తాండ 100 మంది చెంచు విద్యార్థుల వసతి గృహాల కోసం రూ. 2 కోట్ల 75 లక్షలు, బైర్లూటి చెంచు గూడెం 50 మంది చెంచు విద్యార్థుల వసతి గృహాల కోసం రూ 2 కోట్ల 30 లక్షలు, కొట్టాల చెరువు 50 మంది చెంచు విద్యార్థుల వసతి గృహం కోసం రూ.2 కోట్ల 30 లక్షలు పిఎం జన్మన్ నిధులు విడుదలయ్యాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నంద్యాల జిల్లాలో చెంచు విద్యార్థులకు ఐదు వసతి గృహాలు మంజూరయితే శ్రీశైలం నియోజకవర్గం లోనే నాలుగు మంజూరయినట్టు తెలిపారు. వీటి నిర్మాణం కోసం ఇప్పటికే రెండింటికి స్థలాలు కేటాయించామని,మరో రెండింటికి స్థలాల కోసం జాయింట్ కలెక్టర్ ను సంప్రదించామన్నారు. నిర్మాణాలు పూర్తి అయితే చెంచు విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న మహిళలు

జగన్ నిరంకుశ పాలనకు స్వస్తి పలకాలి

- కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా కొనసాగుతున్న జగన్ నిరంకుశ పరిపాలనకు ప్రజలు స్వస్తి పలికి, చంద్రన్న పాలనకు స్వాగతం పలకాలని డోన్ ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం బేతంచర్ల పట్టణంలోని కొత్త బస్టాండ్, కోటపేట కాలనీ, ఎన్జీవోస్ కాలనీలలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం టిడిపి మండల కన్వీనర్ ఉన్నమిళ్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. నగర పంచాయతీ కాలనీకి చెందిన వైసిపి కార్యకర్తలు ఉప్పరి బాలుడు అలియాస్ బక్క బాలుడు తన అనుచరులు శ్రీనివాసులు వెంకటేశ్వర్లు, మద్దిలేటి, అంజి, కంబగిరి రాముడు, రామాంజనేయులు, సన్న సురేష్, మధు, రాజు, కొండయ్య తదితరులు కోట్ల సమక్షంలో టిడిపిలో చేరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బుగ్గన ప్రసన్నలక్ష్మి, టిడిపి నంద్యాల పార్లమెంటు ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వర్ రెడ్డి, రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీ జాకిర్ల బేగ్, భీమేష్ రెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్ అధ్యక్షులు మేకల నాగరాజు, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబెన్, మండల కార్యదర్శి సిమెంట్ నగర్ రాముడు, ముద్దవరం విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలకు అక్కాతమ్ముడు బలి

- చాగలమర్రిలో విషాదం

ప్రజాశక్తి - చాగలమర్రి : మూఢ నమ్మకాలకు అక్క తమ్ముడు బలి అయిన సంఘటన ఆదివారం చాగలమర్రిలో చోటుచేసుకుంది. వివరాలు.. చాగలమర్రిలోని ముత్యాలపాడు బస్టాండ్ కాలనీకి చెందిన షేక్ ఖాజా హుస్సేన్, అతని భార్య షేక్ ఇమామ్ బీ, బావమరిది ఫకీర్ మస్తాన్‌లు ముగ్గురు కలిసి షేక్ ఇమాంబి ఆరోగ్యం సరిగా లేనందున ఎర్రగుంట్ల దర్గా వద్ద పూజలు చేశారు. దర్గాలోని స్వామి చెప్పారని తిరిగి చాగలమర్రికి వెళుతూ కూలూరు గ్రామ సమీపంలోని కుందూ నదిలో స్నానాలు చేసి తిరిగి చూడకుండా పోవాలని అనుకున్నారు. కుందూనది వద్దకు ముగ్గురు వెళ్లి మునిగారు. అయితే షేక్ కాజా హుస్సేన్ కుందునది కట్టపై ఉండగా భార్య షేక్ ఇమాంబి (27), బావమరిది ఫకీర్ మస్తాన్(26)లు నీటి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోయారు. గమనించిన కాజా హుస్సేన్ హుటాహుటిన సమీపంలోని రజకులను తీసుకొచ్చి అన్నా చెల్లెలను బయటికి తీయించాడు. అయితే అప్పటికే వారు మృతి చెందారు. ఘటనపై కాజా హుస్సేన్ ఫిర్యాదు మేరకు రాజుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.